



లలితాదేవిగా దుర్గమ్మ

లేపాక్షి, అక్టోబరు 6: దసరా శరన్నవరాత్రి వేడుకల నాలుగోరోజు ఆదివారం లేపాక్షి ఆలయంలో దుర్గాదేవి.. శ్రీలలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు చేశారు. అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించారు.

రామయ్యగా ఖాద్రీశుడు

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు ఆదివారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకైంకర్యాలు, అలంకరణ అనంతరం రామావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

రామావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు



శ్రీలలితాదేవి అలంకరణలో దుర్గాదేవి



యజ్ఞం చేస్తున్న పండితులు

విశ్వశాంతిని కాంక్షిస్తూ యజ్ఞం

పుట్టపర్తి, అక్టోబరు 6: విశ్వశాంతిని కాంక్షిస్తూ స్థానిక ప్రశాంతి నిలయంలో ఆదివారం వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని పండితులు ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు పూర్ణచంద్రహాల్‌లో వేదమంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞాన్ని ప్రారంభించారు. రుత్వికులు మహాగణపతి పూజతో మొదలు పెట్టి సూర్యనమస్కారం, సర్వదేవతార్చన నిర్వహించారు. మొదటిరోజు యజ్ఞాన్ని వీక్షించడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. వారం రోజులపాటు యజ్ఞాన్ని కొనసాగించి విజయదశమి రోజున పూర్ణాహుతితో ముగించనున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాల్గొన్నవారు



ఇక్కట్ల సర్వే!



భూముల రీసర్వేతో రైతులకు ఇబ్బందులు

- వన్‌బీ, అడంగల్ రాక అవస్థలు
- నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- రెండేళ్లుగా సమస్య
- ఇంకెన్నాళ్లు అంటూ అన్నదాతల ఆవేదన

గత వైసీపీ ప్రభుత్వ నిర్ణయం అన్నదాతను అవస్థల పాల్జేసింది. భూముల రీసర్వే రైతులకు ఇక్కట్లను తెచ్చిపెట్టింది. ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ రావు. భూములు రిజిస్ట్రేషన్ చేయరు. పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే రైతులు.. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందే. రిజిస్ట్రేషన్ కాకపోవడంతో భూముల క్రయవిక్రయాలు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో రైతులు దిక్కుతోచని పడ్డారు.



వన్‌బి, అడంగల్ రాక ఇబ్బందులు పడుతున్నాం

మా భూములకు సంబంధించి వన్‌బీలు, అడంగల్ పారాలు ఆన్‌లైన్‌లో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పథకాలు, రిజిస్ట్రేషన్లకు వీలుకాక పెండింగ్ పెట్టుకున్నాం. ఉన్నతాధికాధికారులు స్పందించి రీసర్వే ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నాం.

- మంజునాథ రెడ్డి, నాగలూరు, మల్కాపురం పంచాయతీ





ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ కావట్లేదు



మా భూములు రిజిస్ట్రేషన్ కాక ఇబ్బందులు పడుతున్నాం. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే అక్కడ భూములకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో రావట్లేదు. ఇప్పటికైనా ఈ సమస్యలు పరిష్కరించాలి.

-శివశంకర్, నాగలూరు, ధర్మవరం మండలం

రీసర్వే పూర్తిచేస్తాం



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు వన్‌బీ, అడంగల్ వచ్చేలా చర్యలు తీసుకుంటాం. రీసర్వేకి ఎంపికైన గ్రామ పంచాయతీలకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. త్వరలోనే ప్రక్రియను పూర్తిచేయించి, రైతులకు పత్రాలు అందుబాటులోకి తెస్తాం.

- నటరాజ, తహసీల్దార్, ధర్మవరం

ధర్మవరంరూరల్, అక్టోబరు 6: మండలంలోని రావులచెరువు, తుమ్మల, గొట్లూరు, మల్కాపురం గ్రామ పంచాయతీలను రీసర్వే కోసం గతంలో అధికారులు ఎంపిక చేశారు. వాటి పరిధిలో 5వేల ఎకరాలుపైగా భూమి ఉంది. అప్పట్లో రీసర్వేకి ఈ గ్రామాలను ఎంపికచేయడంతో మ్యుటేషన్స్, అడంగల్ కరెక్షన్ నిలిపేశారు. దీంతో రెండేళ్లుగా రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వన్‌బీలు కూడా రావట్లేదని వాపోతున్నారు. రీసర్వే పూర్తికాకపోవడంతో జాయింట్ పొలాలకు సంబంధించిన వివరాలు సరిగా అప్‌లోడ్ అవట్లేదు. వన్‌బీలు రాక బ్యాంకుల్లో పంట రుణాల రెన్యూవల్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో మీభూమి పోర్టల్‌లో వన్‌బీలు తెల్లకాగితంపై నమోదు చేసుకుని, వాటిపై మళ్లీ వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ సంతకాలు చేయించుకుని బ్యాంకులో అందజేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్‌బీ కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సిన దుస్థితి నెలకొందనీ, ఇంకెన్నాళ్లు ఈ తిప్పలు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ-క్రాప్ బుకింగ్, ప్రభుత్వ పథకాలు, డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు తదితరవ్యవసాయ



పథకాలు, భూములకు సంబంధించి తప్పనిసరిగా వన్‌బీ కావాల్సి ఉంటుంది. రీసర్వేతో వన్‌బీలు రాకుండా బ్లాక్ కావడంతో రైతులు మీసేవకు వెళ్లి మీభూమి యాప్‌లో నామమాత్రంగా తీసుకుంటున్నారు. వీటిపై మళ్లీ సంతకాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. కుణుతూరు, దర్శినమల గ్రామాల పరిధిలోని భూముల రీసర్వే ప్రక్రియ ఆర్డీఓ పరిశీలనలోకి వెళ్లింది. పట్టాభూములకు సంబంధించి వన్‌బీలు, అడంగల్ రాకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్లు కావట్లేదు. అన్నదమ్ముల భూములకు సంబంధించి సమస్యలు తలెత్తుతున్నాయనీ, ఇప్పటికైనా అధికారులు స్పందించి రీసర్వే ఇక్కట్లు తొలగించి వన్‌బీ, అడంగల్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

వరద బాధితులకు సాయం

పుట్టపర్తి, అక్టోబరు 6: విజయవాడలో ఇటీవల వరదలకు నష్టపోయిన వారికి నియోజవర్గానికి చెందిన టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీ సాయం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 71 టన్నుల బియ్యం, రూ25 లక్షల నగదు సేకరించారు. వాటిని ఆదివారం వాహనాల్లో తరలించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి వాటిని ఆదివారం సాయంత్రం స్థానిక సత్యమ్మ గుడి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వరద బాధితుల సహాయార్థం బియ్యం, నగదును విజయవాడకు తరలించి ముఖ్యమంతి సహాయనిధికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రత్నప్పచౌదరి, నాయకులు శ్రీరామిరెడ్డి, సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

బతుకులను కూల్చిన గతుకు

జాతీయ రహదారిపై కారు బోల్తా..
ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు
బాధితులు బ్రహ్మకుమారీలు



ప్రమాదానికి కారణమైన గతుకుల రోడ్డు

హిందూపురం, అక్టోబరు 6: రహదారిపై ఏర్పడిన గతుకు ప్రమాదానికి కారణమైంది. ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఆరుగురిని ఆస్పత్రి పాల్జేసింది. లేపాక్షి మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపాన హిందూపురానికి మలుపు తిరిగేచోట గతుకులో ఆదివారం బ్రహ్మకుమారీల కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఇద్దరు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరణించిన వారిలో చిలమత్తూరు మండలం శానగానపల్లికి చెందిన నారాయణమ్మ(65), బిసలమానేపల్లికి చెందిన సరస్వతమ్మ(57) ఉన్నారు.

గతుకుల్లో అదుపుతప్పి..

చోళసముద్రం గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై గతుకు ఏర్పడింది. వేగంగా వచ్చే వాహనాలు ఈ గతుకులో అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. లేపాక్షికి చెందిన ఈడిగ అంజినప్ప, ఈడిగ సరస్వతి, బిసలమానేపల్లి వాసులు నారాయణమ్మ, సరస్వతమ్మ, లక్ష్మమ్మ, నగరిగెరకు చెందిన రాజేశ్వరి, చిలమత్తూరు మండలం శానగానపల్లికి చెందిన నారాయణమ్మ కారులో మడకశిరకు వెళ్లారు. అక్కడ కరియప్ప పెద్దకర్మకు హాజరయ్యారు. తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. చోళసముద్రం సమీపాన జాతీయ రహదారిపై గతుకులో వేగంగా వస్తున్న అదుపు తప్పింది. సుమారు 50మీటర్ల దూరంలో ఉన్న డివైడర్‌ను ఢీకొని అవతలి వైపునకు ఎగిరి పడింది. దీంతో ఇందులో ప్రయాణిస్తున్న వారిలో నారాయణమ్మ, సరస్వతమ్మ మృతిచెందారు. గాయపడిన వారిని 108, హైవే అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రాజేశ్వరి, నారాయణమ్మ పరిస్థితి విషమంగా ఉంది. వీరిని ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. డ్రైవర్ సీటుబెల్ట్ పెట్టుకోవడంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. వీరంతా కొంతకాలంగా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. మరో మూడు నిమిషాల్లో గమ్యస్థానాలకు చేరుకునేవారు. ఈ తరుణంలో ప్రమాదం జరగడంతో గాయపడిన, మృతిచెందిన వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. చోళసముద్రం సమీపాన గల రోడ్డు గతుకులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు గాయాలపాలవుతున్నారు. సంబంధింత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.





నారాయణమ్మ, సరస్వతమ్మ మృతదేహాలు



నుజ్జయిన కారు

ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బదిలీ

■ ప్రమోద్‌కుమార్ నియామకం ■



ధర్మవరం, అక్టోబరు 6: వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను ఇక్కడికి నియమించారు.ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునను నెలరోజుల క్రితం నియమించారు. దీనిని టీడీపీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన ఇక్కడకు రాకూడాదంటూ ఆందోళనలు చేపట్టారు. గత వైసీపీ హయాంలో ఇక్కడే కమిషనర్‌గా పనిచేసిన మల్లికార్జున ఆ పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తూ టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ధర్మవరంలో వారం రోజుల క్రితం మంత్రి సత్యకుమార్ నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మల్లికార్జున పాల్గొనడంతో టీడీపీ వర్గీయులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఎన్డీఏ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను బదిలీ చేశారు.



పుట్టపర్తి-కోడూరు రహదారిలో గుంతపల్లి వద్ద వెలసిన లేఅవుట్

విచ్చలవిడిగా వెంచర్లు..!

ప్లాట్లు వేశారు... కోట్లు దోచారు..



అక్రమ లేఅవుట్ల గుర్తింపులో మాయాజాలం
వైసీపీ విధానమే అమలు..
మొదలైన పర్సెంటేజీల పర్వం

పుట్టపర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనుమతుల్లేని లేఅవుట్లు విచ్చలవిడిగా వెలిశాయి. అప్పట్లో ప్రజాప్రతినిధులు, నేతలు.. పర్సెంటేజీ ఇచ్చుకో.. లేఅవుట్ వేసుకో అన్నట్లుగా వ్యవహరించారు. పల్లెపట్నాల్లో లేఅవుట్లలో హద్దులు దాటి రాళ్లు పాతారు. కొలతలతో తికమక పెట్టారు. పేపర్ బ్రోచర్లతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను మభ్య పెట్టి, దోచేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వందలాది లేఅవుట్లు వేసి, వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. ఇవన్నీ తెలిసినా.. అధికారులు.. వెంచర్ల జోలికి వెళ్లలేదు. అనుమతుల్లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు లబోదిబోమంటున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆగస్టులో జిల్లాలో పట్టణాలతోపాటు గ్రామీణప్రాంతాల్లో అనుమతుల్లేని లేఅవుట్లను గుర్తించాలని ఆదేశించారు. వాటిని బ్లాక్‌లిస్టులో పెట్టడంతోపాటు క్రయవిక్రయాలు జరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయల్లో వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక, అహుడా, పుడా అధికారులు మాయాజలం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జిల్లాలో వేలల్లో అక్రమ లేఅవుట్లు ఉంటే తూతూమంత్రంగా కొన్నింటిని గుర్తించి, మిగిలిన వాటిని వదిలేసినట్లు విమర్శలున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ లేఅవుట్లు వెలుస్తూనే ఉన్నాయి. వాటిలో స్థలాల క్రయవిక్రయాలు కూడా కొనసాగుతున్నాయి. అయినా.. అడ్డుకునేవారు కరువయ్యారు.

కోట్లు దోచేసి..

జిల్లాలో అనధికార వెంచర్లలో ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. హిందూపురం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, పెనుకొండ పురపాలక సంఘాల్లో శివారుప్రాంతాలతోపాటు రహదారుల్లో భారీగా అనుమతుల్లేని వెంచర్లు వెలుస్తున్నాయి. నాలా కన్వర్షన్ నిబంధనలు పాటించరు. రోడ్లు విశాలంగా ఉండవు. పార్కులు, ఓపెన్ స్థలాలు కన్పించవు. మౌలిక వసతులు కూడా అంతంతే. ఇది తెలియకు చాలామంది తక్కువ ధరలకు స్థలాలు వస్తున్నాయని కొనుగోలు చేసి, నష్టపోతున్నారు. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ పట్టణ ప్రణాళిక అనుమతుల కోసం నానా కష్టాలు పడాల్సివస్తోంది.

రెండువిధాలా ఆదాయం

పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు.. అనుమతుల్లేని లేఅవుట్లపై చర్యలు చేపట్టే విషయాన్నే మరిచారు. చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక, వాటిని కొనుగోలు చేసిన ప్రజల నుంచి ఇళ్ల నిర్మాణ సమయంలో అనుమతుల కోసం భారీగా గుంజుతున్నారు. ఓవైపు అనుమతుల్లేని లేఅవుట్లకు సహకరిస్తూ, మరోవైపు వాటిలో ఇళ్ల నిర్మాణ అనుమతులకు కూడా ఆమ్యామ్యాలు వసూలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో అనుమతుల్లేని లేఅవుట్లను నియంత్రించాల్సిన వారే ప్రోత్సహిస్తున్నారమాట.

మమ అనిపించేశారు..

జిల్లాలో రహదారుల నిర్మాణం, విస్తరణ కారణంగా స్థిరాస్తి వ్యాపారం పుంజుకుంది. పట్టణాలతోపాటు పల్లెల పరిధిలో రహదారుల పక్కన భారీగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఇదే అదునుగా తీసుకున్న వైసీపీ నేతలు గత ఐదేళ్లలో అనుమతుల్లేని లేఅవుట్ల నుంచి పర్సెంటేజీల రూపంలో వందల కోట్ల రూపాయలు వెనుకేసుకున్నారు. అలాంటి లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అలాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ లేఅవుట్ల వివరాలను పట్టణ ప్రణాళిక, అహుడా పుడా అధికారులు గుర్తించారు. గుట్టుగా దాచేశారు. హిందూపురంలో 24, పెనుకొండలో 7, గోరంట్లలో 5, కదిరిలో 28, ధర్మవరంలో 78 గుర్తించి, నోటీసులు జారీ చేశారు. క్రయవిక్రయాలు చేపట్టరాదంటూ ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వివరాలు పంపారు. ఇదంతా తూతూ మంత్రంగా చేశారన్న విమర్శలున్నాయి. చాలావాటిని వదిలేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల ఒత్తిళ్లతో లేఅవుట్లకు అనుమతుల్లేకుండా జనానికి అంటగడుతున్నా చూసీచూడనట్లు అధికారులు వ్యవహరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో అక్రమ లేఅవుట్ల జోలికెళ్లకుండా మమ అనిపించేశారు. ఆయా నియోజకవర్గాల్లో గత ప్రభుత్వ హయాంలో వెలసిన లేఅవుట్లతోపాటు కొత్తగా వేసిన వాటిలో కొందరు కూటమి నేతలు గత పాలకుల విధానాన్నే అనుసరిస్తున్నారు. దీంతో అనుమతుల్లేని లేఅవుట్లు భారీగా వెలుస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బూదిలి వద్ద వెలసిన అనధికార లేఅవుట్



సోదరి ట్రావెల్స్ పేరుతో కార్యాలయానికి వాహనాలు

వైద్యశాఖలో ఓ సీనియర్ అసిస్టెంట్ పెత్తనం

నెలనెలా అద్దె బిల్లుల ముసుగులో దోపిడీ

చెక్‌పెట్టే దిశగా ఉన్నతాధికారుల చర్యలు

అనంతపురం టౌన్, అక్టోబరు 6: తన సోదరి పేరుతో ట్రావెల్స్ ఏర్పాటు చేసి ఆ వాహనాలను అధికారులకు అద్దెకు కేటాయిస్తు డీఎంహెచ్‌ఓలో ఓ సీనియర్ అసిస్టెంట్ పెత్తనం చెలాయిస్తున్నాడు. ఆయన పేరులోనే గన్ ఉంది. అందుకే ఆయనను అందరూ అవినీతి గన్ అని పిలుస్తారంటే ఆయన ఏ స్థాయిలో ఆ శాఖలో పెత్తనం చెలాయిస్తున్నారో అర్థమవుతుంది. అద్దె వాహనాల విషయంలో కొన్నేళ్లుగా ఈ కార్యాలయంలో ఆయన హవానే సాగుతున్నట్లు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఆయన జోక్యం మితిమీరుతుండటంతో ఇటీవల ఆయన నియంత ఆగడాలకు అధికారులు చెక్‌పెడుతున్నారని తెలిసింది. అందుకే ఇక్కడి అధికారులపై ఉన్నతాధికారులకు ఆయనే ఫిర్యాదు చేయిస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల వాహనాల అద్దెల విషయం ముసుగులో తన సోదరితో ఫిర్యాదులు చేయించడం హాట్‌టాపిక్‌గా మారింది.

అద్దె వాహనాల్లో అవినీతి

అధికారులు పర్యవేక్షణ కోసం ప్రభుత్వం వాహన వసతి కల్పిస్తుంది. ఇటీవల కాలంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో వాహనాల అద్దెలను ప్రభుత్వం పెంచుతూ వచ్చింది. ఇదే అధికారులు, కార్యాలయాల్లో పనిచేస్తూ చక్రం తిప్పే వారికి కలిసొచ్చింది. కొందరుశాఖల అధికారులు తమసొంత వాహనాలను వాడుకొని అద్దెవాహనాలుగా చూపుతుండగా, ఇంకొందరు తమ బంధువుల పేరున వాహనాలను పెట్టుకొని అద్దె తీసుకుంటున్నారు. ఇదే తరహాలో జిల్లా వైద్యశాఖలోను ఆ అవినీతి గన్ ఈ అద్దెవాహనాల విషయంలో పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారని చెబుతున్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ కారుకు నెలకు రూ45వేలు, ఇతర ప్రోగ్రాం అధికారుల కార్లకు నెలకు రూ35వేలు అద్దె ఇస్తున్నారు. ఇక్కడ అధికారులకు వాహనాలు చూసే సెక్షన్ కొన్నేళ్లుగా ఈయనే చూస్తున్నారు. దీంతో ఆ అధికారులు ఆయన చెప్పిన వాహనాలు తీసుకోవాల్సిందే. ఎవరైనా వద్దని చెబితే వారిపై ఆయన తిరుగుబాటు చేస్తాడు. గతంలో డీఎంహెచ్‌ఓ, మరొక ప్రోగ్రామ్ అధికారిపైనా ఎదురుతిరిగి వేధింపులకు దిగినట్లు ఆ శాఖలో మాట్లాడుకుంటున్నారు. అప్పటినుంచి కొన్నేళ్లుగా ఆయనే తన సోదరిపేరుతో ట్రావెల్స్ ఏర్పాటుచేసి అక్కడనుంచే అద్దెవాహనాలు అధికారులకు కేటాయిస్తూ వస్తున్నారు.

వాహనాలు తిరగకపోయినా బిల్లులు రాయాల్సిందే..

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి వాహనం నెలకు 2,500 కి.మీలు తిరగాల్సి ఉంటుంది. అయితే ఈ అవినీతి గన్ వాహనాలు మాత్రం తిరగవు. ఒకరిద్దరి వాహనాలు మాత్రమే తిరుగుతాయి. మిగిలిన వారు ఎవరు ఆమేర కిలోమీటర్లు తిరగడంలేదు. నిబంధనల మేరకు వాహనాలు తిరిగినట్లు చూపించి నెలనెలా అద్దెబిల్లులు చేయించుకొని దండుకుంటున్నాడు. ఓ మహిళా ప్రోగ్రామ్ అధికారి నెలంతా కలిసి కూడా జిల్లాకేంద్రం వదిలిపోదనే ప్రచారం ఉంది. ఆ మహిళా అధికారికి వాహనం ఏర్పాటుచేశారు. ప్రతినెలా అద్దెబిల్లు తిరిగినట్లు రాసుకుంటూ డబ్బు దండుకుంటున్నాడు.



జిల్లా వైద్యశాఖ కార్యాలయం

దూకుడుకు కళ్లెం.. అధికారులపై ఫిర్యాదులు

అవినీతిగన్ అక్రమాలు మితిమీరడంతో ప్రస్తుతం ఆశాఖ ఉన్నతాధికారులు ఆయన వ్యవహారాలకు కళ్లెం వేస్తూ వస్తున్నారు. గతంలో ఐదుగురు అధికారులకు అద్దె వాహనాలు ఈయన పెట్టి నడిపించేవాడు. ఇందులో మూడింటిని తొలగించినట్లు ఆశాఖ ఉద్యోగులు అంటున్నారు. కేవలం ఇద్దరికి మాత్రమే ఇప్పుడు వాహనాలు అద్దెకి తిప్పుతున్నారు. ఇందులో కూడా జిల్లాను వదలి వెళ్లని ఓ మహిళా ప్రోగ్రామ్ అధికారికి ఉంది. ఆమె వాహనం తిరగక పోయినా తిరిగినట్లు రాయించుకొని బిల్లులు చేయించుకుంటున్నాడు. అయితే ఆ మహిళా అధికారి బిల్లు విషయంపైనా వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. వాహనాల్లో ఏరోజు ఎక్కడికి వెళ్లినా అక్కడ ముఖహాజరు వేయాల్సి ఉంటుంది, అయితే ఈ మహిళా ప్రోగ్రామ్ అధికారి రోజు కార్యాలయంలో కూర్చొని హాజరు వేసినట్లు రికార్డుల ఆధారంగా తెలిసింది. అయినా 2,500కిలో మీటర్లు తిరిగినట్లు అద్దె బిల్లు పెట్టగా ముఖహాజరుతో పెడితేనే బిల్లు చేస్తామని సంబంధిత సెక్షన్ అధికారులు తిరస్కరించి వెనక్కు పంపారు. గతంలో కేవలం ప్రోగ్రామ్ అధికారులే ఇన్ని కిలోమీటర్లు తిరిగామని రాసిపంపితే బిల్లులకు డీఎంహెచ్‌ఓ ఇతర అధికారులు ఆమోదం వేసి పంపేవారు. దీంతో నెలనెలా అద్దెబిల్లుల దోపిడీ చేసుకొని జేబులునింపుకునేవారు. ప్రస్తుతం సర్వీస్ ఇంజనీరు, ఏఓలు రీడింగ్‌చూసి వారి ఆమోదంతోనే బిల్లులు పెట్టే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ఇలా ఆ అవినీతి గన్ అక్రమాలకు కళ్లెం వేస్తూ వస్తున్నారు. దీంతో ఆయన కార్యాలయ అధికారులపై ఫిర్యాదులు చేయిస్తున్నాడని అంటున్నారు.

ఫిర్యాదులు రావడంతోనే వాహనాలు వద్దన్నా



అద్దె వాహనాల విషయంలో అనేక ఆరోపణలు రావడంతోనే అధికారులు పాత కార్లను వద్దన్నారు, ఇంకా రెండు వాహనాలు ఉన్నాయి. ఆ వాహనాల అద్దె విషయంలోనూ మళ్లీ వివాదం సాగుతోంది. ఓ కారు తిరగక పోయినా తిరిగినట్లు బిల్లులు పెట్టినట్టు ఫిర్యాదురావడంతో పెండింగ్ పెట్టారు. ఎవరైనా నిబంధనల మేరకు అద్దె వాహనాలు నడవాల్సిందే. ఆ సీనియర్ అసిస్టెంట్‌పై వస్తున్న ఆరోపణలపైనా విచారణ చేస్తాం. వాస్తవమైతే చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ

కొర్రసాగు... భలే బాగు

పెట్టుబడి తక్కువ... ఆదాయం ఎక్కువ

తనకల్లు, అక్టోబరు 6: అతివృష్టి, అనావృష్టికారణంగా నష్టపోయిన రైతులు వర్షాధార భూములు సాగుచేయడమే వదిలేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైతం కొర్రను సాగుచేసి కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ యేడాది వందఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. తీవ్ర వర్షాభావంలోనూ ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దాకా దిగుబడి అవకాశమున్నట్లు రైతులంటున్నారు. కొర్ర పంట సాగుచేయడానికి పెట్టుబడి తక్కువని, ఆదాయం బాగా వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ధర రూ. 3,500 ఉన్నట్లు చెబుతున్నారు. తమ భూములను బీడుగా వదిలేకంటే కొర్ర పంట సాగుచేస్తే లాభాలు పొందవచ్చని సూచిస్తున్నారు.



ఎర్రగుట్టపల్లి వద్ద సాగుచేసిన కొర్ర పంట

కొర్ర పంట బాగుంది



బీడుభూమిగా ఉన్న పొలంలో ఈయేడు రెండు ఎకరాల్లో కొర్రపంట సాగుచేశాను. తీవ్ర వర్షాభావమున్నా పంట చేతికి వస్తోంది. రెండు ఎకరాలకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేఅవకాశముంది. కొర్ర సాగులో పెట్టుబడికూడా తక్కువే. వేరుశనగతో పోలిస్తే చాల తక్కువ. రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలి.

- పాపన్న, ఎర్రగుట్టపల్లి

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మండలవ్యాప్తంగా మూడువందల ఎకరాల దాకా కొర్రపంట సాగుచేశారు. ప్రభుత్వాలు చిరుధాన్యాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. చిరుధాన్యాలను ప్రాసెసిం గ్ చేసి విక్రయించుకోవడానికి తగి న యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేయాలి. కొర్రపంట ప్రస్తుతం కోత దశలో ఉంది. రెండుమూడు పదునుల వర్షాలకే పంట చేతికొస్తుంది. మూడు ఎకరాల్లో సాగుచేశారు. 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చే అవకాశముంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దపల్లి

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్య పంటలను ప్రోత్సహిస్తున్నాయి. శాస్త్రవేత్తలు కూడా కొర్రలో కొత్త వంగడాలు రూపకల్పలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొత్తరకాలు వంగడాలు అందుబాటులో ఉన్నాయి.

- శ్రీహరినాయక్, ఏఓ

ఇసుక ట్రాక్టర్ వదిలేయడం వెనుక..?

గుమ్మఘట్ట, అక్టోబరు 6: మండల పరిధిలోని వేదావతి హగరి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా రాయదుర్గం పోలీసుల కనుసన్నల్లో జరుగుతోంది. ఆదివారం సాయంత్రం స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ సభ్యుడు నాదల్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను వేదావతి హగరి నుంచి ఇసుక రవాణా చేస్తుండగా హెడ్ కానిస్టేబుల్ రహిమాన్ స్టేషన్‌కు తరలించాడు. ఇంతలోనే ట్రాక్టర్ యజమాని నాదల్ రాయదుర్గం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో మంతనాలు జరిపి ఎటువంటి అపరాధ రుసుం, కేసు లేకుండా ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. సాధారణ కూలీలు, ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే పోలీసు ఉన్నతాధికారులు మామూళ్ల మత్తులో మునిగి ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పోలీసు అధికారులను సంప్రదించగా పొంతనలేని సమాధానం చెప్పడం గమనార్హం.

దెబ్బతిన్న జీబీసీ బెడ్డింగ్

వృథాగా వంకకు పారుతున్న సాగునీరు



కూలిన యూటీ కాలువ సిమెంట్ కాంక్రీట్ బెడ్డింగ్

విడపనకల్లు, అక్టోబరు 6: మండలంలోని జీబీసీ కాలువకు 28.5వ కిలోమీటర్ వద్ద యూటీ బ్రిడ్జికి కింద ఉన్న కాంక్రీట్ బెడ్ కూలి పోవటంతో సాగు నీరు వృథాగా పారుతోంది. డొనేకల్లుకు వెళ్లే పెద్ద వంకకు జీబీసీ అధికారులు సాగునీటిని కింద ఉన్న రైతులకు అందేలా యూటీ బ్రిడ్జి నిర్మించారు. ఇది పూర్తిగా పాతది కావటంతో నీటి ఉధృతికి సిమెంట్ కాంక్రీట్ బెడ్ లోపలికి కుంగిపోయింది. దీంతో కాలువ నీరు వృథాగా డొనేకల్లు వంకకు పారుతోంది. 300క్యూసెక్కుల నీరు కాలువకు వస్తున్నా కిందకు వెళ్లక పోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. శనివారం మండలంలో భారీ వర్షం రావటంతో జీబీసీ అధికారులు కాలువ నీటిని బంద్ చేశారు. దీంతో ఇక్కడ బ్రిడ్జికి(యూటికి) ఉన్న కాంక్రీట్ బెడ్ కూలిపోయి సాగు నీరు వంకకు పారుతున్న విషయాలు రైతులు ఆదివారం గుర్తించారు. దాదాపుగా ఒక డిస్ట్రిబ్యూటరికి పారే నీరు వృథాగా వంకకు పారుతోంది. ఈ నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆటోలో బంగారు మరిచిన దంపతులు

రెండు గంటల్లో అప్పగించిన పోలీసులు



బాధితులకు బంగారు నగలను అందజేస్తున్న ఏఎస్ఐ

తాడిపత్రి, అక్టోబరు 6: ఐదుతులాల బంగారు నగలను ఆటోలో మరిచిపోవడంతో బాధితుల ఫిర్యాదుపై స్పందించిన పట్టణ పోలీసులు రెండు గంటల్లోనే నగలను బాధితులకు అప్పగించారు. కడపకు చెందిన గురుప్రసాద్, వాణి దంపతులు. వ్యక్తిగత పనినిమిత్తం అనంతపురం వెళ్లేందుకు రైలులో ఆదివారం తాడిపత్రికి వచ్చారు. రైల్వేస్టేషన్‌లో లగేజీ బ్యాగులతో ఆటో ఎక్కిన వీరు అనంతపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బస్సు ఎక్కేందుకు దిగేశారు. ఆ సమయంలో ఒక బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు. కొంత దూరం ప్రయాణించాక మరో చిన్నబ్యాగును చూసుకున్నారు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఆటోలో మరిచిపోయినట్లు గుర్తుచేసుకున్నారు. బ్యాగులో విలువైన బంగారు వస్తువులు ఉండడంతో వెంటనే బస్సులో నుంచి దిగి తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు ఆటో నెంబరు సాయంతో లోకేషన్‌ను కనుగొన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో లోకేషన్ ఆధారంగా పోలీసులు నేరుగా ఆటో ఉన్న ప్రదేశానికి వెళ్లారు. అక్కడే ఉన్న డ్రైవర్‌తో సహా ఆటోను స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆటోలోని బ్యాగును అందులోని నగలను పరిశీలించి అపహరణకు గురికాలేదని పోలీసులు నిర్ధారించారు. బాధితులకు బంగారు నగలను అందజేసినట్లు ఏఎస్ఐ నాగన్న తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

చెన్నేకొత్తపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించుకుని వెళ్లారు. శైలజ, వెంకటరెడ్డి దంపతులు. న్యామద్దల గ్రామంలోని తమ వ్యవసాయ తోటలో పొలం పనులు చూసుకుని తిరిగి ద్విచక్రవాహనంలో చెన్నేకొత్తపల్లికి వస్తున్నారు. అయితే హంద్రీనీవా కాలువ దారివెంట వస్తుండగా హైవేకి సమీపంలో కోనకు వెళ్లే దారిలో మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వారిని అడ్డగించి దాడికి యత్నించారు. ఈ క్రమంలో శైలజ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని ద్విచక్రవాహనంలో పరారైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాస్తవ ఘటనల ఆధారం 'ది గ్రేట్ డిక్లైన్'

పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 6: వాస్తవ సంఘటనల ఆధారం 'ది గ్రేట్ డిక్లైన్' అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆచార్య వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి 'ది గ్రేట్ డిక్లైన్' కథల పుస్తకావిష్కరణ ఆదివారం ఎన్జీఓ హోంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మార్కెట్ వాస్తవ విలువలు ప్రజలకు తెలియకుండా పేదలు, నిరుపేదలను మార్కెట్ మాయాజాలం ఎలా పిప్పి చేస్తుందో, ఎలా దోపిడీకి గురి చేస్తుందోనన్న వాస్తవ సంఘటనల ఆధారంగా చూపించిన కథలన్నారు. ది గ్రేట్ డిక్లైన్ కథల పుస్తక రచయిత ప్రపంచ సంక్షోభం వెనుక దాగి ఉన్న సమస్యల గురించి చక్కగా రాశారన్నారు. కార్యక్రమంలో పుస్తక సమీక్షకులు, ప్రముఖ విమర్శకులు వేణుగోపాల్, డాక్టర పొదిలి నాగరాజు, డాక్టర్ నాగేశ్వరాచారీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతి నారాయణ, నిర్మలా రాణి, కవులు, రచయితలు నానీల నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, పూజారి ఈరన్న, అమర్నాథ్‌రెడ్డి, శ్రీధర్, ముని నారాయణప్ప పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ఏపీ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ సంఘం నేతలు



మాట్లాడుతున్న వైద్య ఉద్యోగులు

అనంతపురం టౌన్, అక్టోబరు 6: వైద్య, ఆరోగ్యశాఖల్లో పనిచేస్తున్న అన్నికేడర్ల సమస్యలు పరిష్కరించే వరకు సమష్టిగా పోరాటాలు సాగిస్తామని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఉద్యోగ సంఘం నేతలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో జిల్లా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు చంద్రమోహన్, వెంకటరమణ, లక్ష్మన్న, నాగేంద్రప్రసాద్, రాఘవేంద్ర, హరిక్రిష్ణ తదితరులు మాట్లాడుతూ వైద్య ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అనేక ఏళ్లుగా సమస్యలు తీర్చాలని, న్యాయం చేయాలని ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధన కోసం ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఐక్యంగా పోరాటాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జానీ, విజయ్‌కుమార్, లోకనాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 6: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్-19 కుస్తీ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 కుస్తీ బాల, బాలికల క్రీడా పోటీలు ఆదివారం ఎన్టీఆర్ కృష్ణాలో జరిగాయి. బాలుర విభాగంలో జిల్లాకు చెందిన శాంతు, యశ్వంత్, రంగస్వామి బంగారు పతకాలు సాధించారు. మహ్మద్ దావూద్, గురుప్రసాద్ కాంస్య పతకాలు సాధించారు. బాలికల విభాగంలో స్పందన, మానస రజత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 23వతేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలను శాప్ కోచ్ రాఘవేంద్ర, టీం మేనేజర్ జ్యోతి, పీఈటీలు నరసింహులు, సాయి కుమార్, కుళ్లాయప్ప అభినందించారు.

పాపం.. పసిపాప..

బస్టాండులో వదిలి వెళ్లిన మహిళ



చిన్నారిని ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

కదిరి, అక్టోబరు 6: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ గుర్తు తెలియని మహిళ ఐదునెలల పసిపాపను వదిలి వెళ్లినట్లు సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదునెలల చిన్నారిని తీసుకుని వచ్చిందన్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తానని, పక్కనే ఉన్న మహిళకు పాపనిచ్చి వెళ్లి అలాగేనే తిరిగిరాకుండా వెళ్లిపోయింది. ఎంతసేపుకు తిరిగిరాకపోవడంతో ఆ మహిళ 100కు ఫోన్ చేసిన పోలీసులకు విషయం తెలిపింది. పోలీసులు హుటాహుటిన వచ్చి మహిళ కోసం వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో పాపను తీసుకున్న మహిళ పోలీసులకు చిన్నారిని అప్పగించింది. పోలీసులు ఐసీడీఎస్ సిబ్బందిని పిలిపించి శిశువిహార్‌కు శిశువును పంపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమోటా కిలో రూ.52

అనంతపురంరూరల్, అక్టోబరు 6: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.52తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు ఆయన తెలిపారు.

మద్యం షాపుల దరఖాస్తుదారుల హాజరుకు సడలింపులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 6: ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారుల హాజరుకు సంబంధించి ప్రభుత్వం సడలింపులు ఇచ్చినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన నేపథ్యంలో దరఖాస్తుదారుడు దరఖాస్తు నమోదు చేసే సమయంలో తాను హాజరుకాలేని పక్షంలో తాను ఆథరైజ్ చేసిన మరో వ్యక్తికి పంపించి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా లాటరీ తీసే సమయంలో దరఖాస్తుదారుడు వివిధ జిల్లాల్లో షాపులకు దరఖాస్తు చేసినట్లైతే అన్ని చోట్ల హాజరు కాలేని పరిస్థితుల్లో తన ఆథరైజేషన్ లెటర్ ద్వారా మరో వ్యక్తిని లాటరీకి హాజరుపర్చవచ్చునన్నారు. ప్రభుత్వం తయారు చేసిన ప్రొఫార్మాలో ఆథరైజేషన్ లెటర్‌ను తప్పని సరిగా అందజేసి దరఖాస్తు, లాటరీ సమయాల్లో సడలింపు పొందవచ్చునని సూచించారు.

ఒక్క రోజే 117 దరఖాస్తులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 6: జిల్లాలోని ప్రైవేటు మద్యం షాపులకు 289 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించారు. దీంతో ఆదివారం సెలవు రోజు కూడా జిల్లాలోని పలు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం దాకా 172 దరఖాస్తులు రాగా.. ఆదివారం ఒక్క రోజే 117 దరఖాస్తులు వచ్చాయి. ఆఖరు తేదీకి ముందుగానే ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. ఆఖరు రోజు సర్వర్ సమస్య తలెత్తితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని సూచించారు.

టెండర్ ప్రక్రియ పరిశీలన

హిందూపురం: మద్యం షాపుల టెండర్ల ప్రక్రియను ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. ఆదివారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, శ్రీసత్యసాయి జిల్లా ఈఎస్ గోవింద నాయక్, ఏఈఎస్ నరసింహులు పరిశీలించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఎక్కడి నుంచైనా టెండర్ వేయవచ్చన్నారు. ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా వేయవచ్చన్న వెసలుబాటుందన్నారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌంటర్లు, కంప్యూటర్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఆదివారం నాటికి ఐదు దరఖాస్తులు వచ్చినట్లు సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు.

జీడిపల్లికి 1021 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 6: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1021 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపా రు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 947 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.647 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

డీఎస్పీ పేరుతో కుచ్చుటోపీ

పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 6: తాను స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీని అని మీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూస్తానని నమ్మబలికి ఓ రైతు నుంచి నగదును కాజేసిన ఉదంతం మండలంలోని మేడాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు ముత్యాలు తెలిపిన వివరాల మేరకు మేడాపురం గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర అప్పుల బాధ తాళలేక సెప్టెంబరు 30వతేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై అతడి భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సూరి మృతుడి అన్న ముత్యాల్‌కు ఫోన్ చేసి నీవు కొంతమొత్తం డబ్బు కడితే రూ.6లక్షలకుపైగా డబ్బులు అకౌంట్‌లోకి పడుతుందని చెప్పి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీతో మాట్లాడు అని ఫోన్ కలిపాడు. వారిద్దరు కలిసి ముత్యాల్‌ను మాయమాటలతో నమ్మించడంతో అది నిజమని భావించిన ముత్యాలు వెంటనే తన ఖాతా నుంచి రూ.18,160 ఫోన్‌పే చేశాడు. కొద్దిసేపటికి పరిహారం విషయం గురించి సూరిని అడగ్గా సార్‌తో మాట్లాడుతా అని చెప్పాడు. అయితే గట్టిగా నిలదీయగా సారు తన ఫోన్ ఎత్తడం లేదని ఏం చేయాలంటూ తప్పించుకున్నాడని వాపోయాడు. తాను మోసపోయానని అర్థమైందని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. పోలీసులు న్యాయం చేయాలని కోరాడు.

వేతనాలు చెల్లించండి



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నల్లమాడ, అక్టోబరు 6: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు జీవోనెంబర్ 549 ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ ద్వారానేకార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకుండా వీరి వేతనాల ద్వారా అధికమొత్తంలో డబ్బులు డ్రా చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి కార్మికుడికి రూ.26వేలు జీతం చెల్లించేలా కృషి చేయాలన్నారు. ఆయనతోపాటు కార్మికులు నరసింహులు, శ్యామల, ముత్యాలమ్మ, నరసమ్మ ఉన్నారు.

వ్యక్తిపై దాడి... పరిస్థితి విషమం

ధర్మవరం, అక్టోబరు 6: పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ వ్యక్తిపై మునిరత్నం దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు కాలనీలో షేక్ హుస్సేన్‌పీరా చిల్లర అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. హుస్సేన్ పీరా ఇంటి ఎదురుగా మునిరత్నం ఉంటున్నాడు. మునిరత్నం తరచూ మద్యం తాగి గొడవపడేవాడు. మద్యం సేవించినప్పుడు కాలనీలోని మహిళలను నోటికి వచ్చినట్టు మాట్లాడుతుండేవాడు. ఈక్రమంలో హుస్సేన్ పీరా కోడలు ఇంటి ముందు ఉండగా ఆమెను దుర్భాషలాడాడు. హుస్సేన్‌పీరా ఆడవాళ్లను ఆలా మాట్లాడటం సరికాదని, ఇది మంచి పద్ధతికాదని మునిరత్నంకు చెప్పడంతో మునిరత్నం చేతిలో ఉన్న స్క్రూడ్రైవర్‌తో తలపై బాది తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు హుస్సేన్‌పీరాను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ సిబ్బందితో ఆస్పత్రికి వెళ్లి జరిగిన సంఘటన గురించి బాధితుడితో ఆరాతీశారు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హుస్సేన్ పీరా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

రైతుకు పరామర్శ


నరికివేసిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న చిలకం మధుసూదనరెడ్డి

బత్తలపల్లి, అక్టోబరు 6: మండలంలోని తంబాపురం గ్రామంలో జనసేన కార్యకర్త రమణారెడ్డికి చెందిన చీనీ చెట్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన సంగతి తెలిసిందే. తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి ఆదివారం నరికివేసిన చీనీ చెట్లను పరిశీలించి రైతును పరామర్శించారు. ఎస్ఐ శ్రీనివాసులుతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లడుతూ రైతులు సాగు చేసిన పంటలను నరికివేయడం ధర్మవరం ప్రాంతానికి చెందినది కాదన్నారు. ఇలాంటి సంస్కృతి జిల్లాలో లేకుండా చేయలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నామని అన్నారు. రైతులు చమటోడ్చి చెట్లను కన్నబిడ్డల్లా పెంచుకుంటున్న వాటిని మానవత్వంలేని దుర్మార్గులు నరికివేయడం దారుణమన్నారు. బీజేపీ, జనసేన నాయకులు వీరనారప్ప, రవి, వెంకటస్వామి, శివారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళి


ఓబన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 6: మండల కేంద్రంలో వడ్డె ఓబన్న వర్ధంతి వడ్డెర కులస్థులు నిర్వహించారు. పుట్టపర్తి రహదారిలోని వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వడ్డె ఓబన్న స్వాతంత్ర్యం కోసం పాటుపడిన నాయకుడు అని ఆయనను ప్రస్తుత ప్రభుత్వాలు విస్మరించడం సమంజసం కాదన్నారు. వడ్డె ఓబన్న బ్రిటీష్ వారితో స్వాతంత్ర్య పోరాటానికి నడుం బిగించారన్నారు. ఆయన జీవిత చరిత్రను ప్రస్తుత తరానికి వివరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర కులస్థులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి: ఈయూ


డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 6: జిల్లాలో అన్ని డిపోలకంటే ధర్మవరం డిపోలో పనిభారం అధికంగా ఉందని, దానిని తగ్గించాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన చేపట్టారు. ఈయూ జిల్లా జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పనిభారం విషయంపై డిపో మేనేజర్ దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదన్నారు. ఏ డ్యూటీ స్థానంలో వస్తాయో అదే డ్యూటీలను కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈయూ జిల్లా కమిటీ సభ్యుడు నరసింహులు, డిపో కార్యదర్శి ముస్తఫా, కమిటీ సభ్యులు బాబు, తిరుమలేశు, చింతారామకృష్ణ, శంకర పాల్గొన్నారు.

మహిళతో అనుచిత ప్రవర్తన

పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, అక్టోబరు 6 : నగరంలోని ఓ హోటల్‌లో మహిళ పట్ల అక్కడ పనిచేసే వ్యక్తి అనుచితంగా ప్రవర్తించాడు. బాధితులు, టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... నగరానికి చెందిన ఓ మహిళ ఆదివారం రాత్రి తన ఇద్దరు పిల్లలతో విద్యుత్‌నగర్ సర్కిల్‌లోని ఓ హోటల్‌కు వెళ్లింది. పూరి, దోశ ఆర్డర్ చేసింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న వెంకటేష్ పూరీ రెండో ప్లేట్ తీసుకోమన్నాడు. ఆ మహిళ తాను చెప్పలేదనగా.. పర్లేదనీ తీసుకోమన్నాడు. ఏం మాట్లాడుతున్నావ్ అంటూ ఆ మహిళ కోప్పడింది. అదే సమయంలో ఈ బిల్లు తీసుకోవద్దనీ, తమవారే అనే అర్థం వచ్చేలా క్యాష్‌కౌంటర్‌లో కూర్చున్న యజమానికి చెప్పాడు. అక్కడ ఆ మహిళ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ మహిళ దగ్గరగా వచ్చి చట్నీ వేసుకోమంటూ చెప్పాడు. మహిళలతో ఇలాగేనా ప్రవర్తించేది అంటూ ఆమె మండిపడింది. వెంటనే తన బంధువులను పిలిపించింది. హోటల్ యజమానులు సైతం ఈ విషయంలో తమకు మద్దతివ్వలేదని బాధిత వర్గాలు తెలిపాయి. దీంతో అతడిపై కోపంతో ఆమె కుటుంసభ్యులు దాడికి ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితురాలు టూటౌన్ సీఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. మద్యం మత్తులో అతడు అలా వ్యవహరించినట్లు తేలిందని సీఐ తెలిపారు.

ధూపదీప నైవేద్యాలు కరువు

- శిథిలావస్థలో వీరభద్ర ఆలయం
- మాన్యం భూములున్నా నిరుపయోగం
- చెరువు నిండితేనే పంటల సాగు
- ప్రభుత్వం దృష్టిసారించాలంటున్న గ్రామస్థులు


వీరభద్రస్వామి మూలవిరాట్టు


శివలింగం

నంబులపూలకుంట, అక్టోబరు 6: మాన్యం భూములున్నా వీరభద్రుని ఆలయానికి ధూపదీప నైవేద్యాలు కరువయ్యాయి. మండలంలోని వంకమద్ది గ్రామానికి కిలోమీరు దూరంలో వంకమద్ది చెరువుంది. చెరువు కట్ట పక్కనే ఓ గుట్టపైన రాయలవారు నిర్మించిన వీరభద్రస్వామి ఆలయం ఉంది. ఆలయంలో వీరభద్రుడు, శివాలయం, ఆరుబయట నాగలకట్ట ఉంది. ఆలయంలో ఎత్తైన రాతిపై భయంకర రూపంలో వీరభద్రుడు దర్శనమిస్తారు. అనేకమార్లు ఇక్కడ గుప్తనిధుల తవ్వకాలు చేపట్టారు. వీరభద్రుని పీఠాన్ని పక్కకు జరిపి ఆలయంలో కూడా తవ్వకాలు జరిపారు. స్వామివారి విగ్రహానికి ఎదురుగా నంది విగ్రహముంది. విగ్రహాన్ని ముక్కలుచేసి, పక్కనున్న చింతతోపులో పడేశారు. పురాతన ఆలయంలో గుప్తనిధులున్నాయని, గుప్తనిధుల వేటగాళ్లు పలుమార్లు తవ్వకాలు చేపట్టారు. వంకమద్ది గ్రామస్థులు రెండు సంవత్సరాల క్రితం ఆలయలో విగ్రహాలను పునఃప్రారంభించారు. ఆలయం వద్ద వంకమద్ది చెరువు మండలంలోని పెద్ద చెరువు. ఈచెరువు కింద మరికొమ్మదిన్నె, వంకమద్ది, ఎస్సీకుంటకు చెందిన రైతుల సాగుభూ


వంకమద్ది చెరువు

ములున్నాయి. చెరువు విస్తీర్ణ 361 ఎకరాలుంది. నాలుగవందల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఒకసారి చెరువు నిండితే రెండు పంటలు పండుతాయి. నాడు శ్రీకృష్ణదేవరాయలు పాలనలో ఈచెరువు తవ్వారని, ఆలయాన్ని కూడా ఆయనే నిర్మించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

ధూపదీప నైవేద్యాలు శూన్యం: వీరభద్రస్వామి ఆలయ భూములు ఆరు ఎకరాలున్నారు. గతంలో రెడ్డి, కరణాల చేతుల్లో ఉండేవి. సకాలంలో పంటలు పండకపోవడం, వర్షాలు సరిగా రాకపోవడంతో పంటలు సాగుచే


ఆరుబయట నాగపడగలు


పురాతన ఆలయాలు

సేవారు లేక భూములను బీడుగా వదిలేశారు. వర్షాలు కురిస్తే ప్రస్తుతం మాన్యం భూములను ఎవరోఒకరు సాగుచేసుకుంటున్నారేకానీ, దేవునికి ధూపదీప నైవేద్యాలకు ఇవ్వడంలేదు. పండుగ వస్తే ఇలవెల్పు కుటుంబసభ్యులు, భక్తులు వెళ్లి పూజలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దాతల సాయంతో గర్భగుడి అభివృద్ధి



గుప్తనిధుల వేటగాళ్లు పలుమార్లు ఆలయంలో తవ్వకాలుచేపట్టారు. గ్రామస్థులు, దాతల సహకారంతో గర్భగుడిలో నంది, వీరభద్రస్వాములను పునః ప్రతిష్ఠించారు. గుప్తనిధుల బారినుంచి ఆలయాన్ని కాపాడాలి. ఆలయాభివృద్ధికి నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వమే ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.

- రవీంద్ర, వంకమద్ది

మాన్యం భూములున్నా అభివృద్ధి లేదు



వీరభద్రస్వామి ఆలయ భూములు గ్రామంలో ఉన్నాయి. గతంలో రెడ్డి, కరణాల చేతుల్లో ఉండేవి. వర్షాలు కురవకపోవడంతో భూములు బీళ్లుగా మారాయి. వర్షం కురిసిందంటే గ్రామంలో ఎవరికి అనుకూలమైతే వారు మాన్యం భూములు సాగుచేసుకుంటారు. అయినా ఆలయానికి ఎవరూ డబ్బు చెల్లించరు. పండుగరోజుల్లో మాత్రమే పూజలు జరుగుతున్నాయి. ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది.

-వెంకటరమణ, వంకమద్ది

ఆరోగ్యానికి ధ్యానం అవసరం: మాజీ మంత్రి


ఆర్యవైశ్య సంఘం నాయకులతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, అక్టోబరు 6: మారుతున్న కాలానుగుణంగా మనిషి జీవితం, నిత్యం ఒత్తిడికి గురవుతున్నారని ప్రశాంత జీవనానికి ధ్యానం ఎంతైనా అవసరమంటూ మాజీ మంత్రిపల్లెరఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వాసవీ నివాస్‌లో బ్రాండ్ అంబాసిడర్ మీటింగ్-8 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె మాట్లాడుతూ... మనిషి జీవితం పోటీతత్వంలో సాగుతోందని, దీంతో ప్రశాంతత కొరవడిందన్నారు. ధ్యానంతో వాటిని దూరం చేయవచ్చన్నారు. వాసవీ నివాస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం అభినందనీయమన్నారు. అనంతరంవాసవీ పాఠశాల ఉపాధ్యాయులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను పంపిణీచేశారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు సిద్దానాగేశ్వరరావు, కోటాసత్యం, హనుమంతరావు, బాలక్రిష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఓబుళదేవరచెరువు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందచేస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సీఎం చంద్రబాబు దశలవారీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తిచేసిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, బోరు రమణ, నిజాం, మీసేవ సుధాకర్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాటమయ్య



ప్రమాణస్వీకారం చేస్తున్న కమతం కాటమయ్య

ధర్మవరం, అక్టోబరు 6: ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధర్మవరానికి చెందిన కమతం కాటమయ్య విజయవాడలో ఆ సంస్థ కార్యాలయంలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కాటమయ్య టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడుగా ఉంటూ బలోపేతానికి కృషిచేశారు. రైతుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కాటమయ్య పేర్కొన్నారు.

వన్‌టౌన్ ఎస్ఐల బాధ్యతల స్వీకరణ


గోపీకుమార్


మహమ్మద్ రఫీ

ధర్మవరం, అక్టోబరు 6: పట్టణ వన్‌టౌన్ ఎస్ఐలుగా గోపీకుమార్, మహమ్మద్‌రఫీలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ అనంతపురం వన్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు. గోపీకుమార్, మహమ్మద్‌రఫీ ఎన్నికలకు ముందు తిరుపతికి బదిలీపై వెళ్లారు. అనంతరం వీఆర్‌లో ఉన్న వీరిద్దరిని వన్‌టౌన్ ఎస్ఐలుగా ఎస్పీ ఉత్తర్వులు జారీచేయడంతో వారు బాధ్యతలు చేపట్టారు. పట్టణంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎస్ఐలు తెలిపారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ప్రజారవాణాధికారి


సిబ్బందికి సూచనలిస్తున్న ప్రజారవాణాధికారి

కదిరి అర్బన్, అక్టోబరు 6: కదిరి ఆర్టీసీ డిపోను జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ ఆదివారం సందర్శించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతిసౌకర్యాలు, తాగునీరు, కూర్చీలు, ఫ్యాన్లు, పరిశుభ్రతను పరిశీలించారు. త్వరలోనే కదిరినుంచి శ్రీశైలం బస్సు సర్వీసు నడపనున్నట్లు చెప్పారు. యూనియన్ నాయకులు డిపో నుంచి పుట్టపర్తి, ధర్మవరం డిపోల్లో రీలీవ్ డ్యూటీపై పనిచేస్తున్న సిబ్బందిని వెనక్కుపంపాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు పంపుతామన్నారు. ఆయనతోపాటు ఇన్‌చార్జి డిపో మేనేజర్ హరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, ఎన్ఎంయూఏ నాయకులు ఎన్వీ రమణ, హరిమోహన్, బైరిశెట్టి, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు ఉన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.83లక్షలు

అనంతపురంరూరల్, అక్టోబరు6: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.4,83,840 ఆదా యం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివా రం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,70,540, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,13,300 వచ్చిందని ఆయన తెలిపారు.

బాలాత్రిపురసుందరీ...

శరణు.. శరణు..


పుట్టపర్తి: బాలాత్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గవ రోజు ఆదివారం లలితాత్రిపురసుందరిగా అమ్మవారు పూజలందుకున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి, సత్యమ్మ, దుర్గమ్మ, గాయత్రీ మందిరాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మహిళలు అమ్మవార్లకు కుంకుమార్చన చేయించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్


కదిరి: అన్నపూర్ణగా చౌడేశ్వరీదేవి


ధర్మవరం: మీనాక్షీదేవిగా చౌడేశ్వరిమాత


ముదిగుబ్బ: లలితాదేవిగా వాసవీమాత


కొత్తచెరువు: మీనాక్షీదేవిగా వాసవీమాత

రోడ్డు నిర్మాణానికి నేడు భూమిపూజ

తనకల్లు, అక్టోబరు 6: మండలంలోని గద్దలబండతండా నుంచి ఎర్రగుట్టపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ చేయనున్నట్లు టీడీపీ నాయకుడు శంకర్‌నాయుడు తెలిపారు. గేమేనాయక్ తండా సర్పంచ్ కాంతమ్మఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రూ.50లక్షల వ్యయంతో 15 కి.మీ, తార్‌రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఫుట్‌బాల్ కోచింగ్ ప్రారంభం



ఫుట్‌బాల్ జట్టుతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, అక్టోబరు 6: పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సీనియర్ టీమ్ ఫుట్‌బాల్ కోచింగ్‌ను ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఉదయమే మైదానానికి వెళ్లి క్రీడాకారులతో ముచ్చటించి, వారితో ఫుట్‌బాల్ ఆడారు. పరుగు పందెంలో పాల్గొన్నారు. ఫుట్‌బాల్‌తో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 6: కలసిమెలసి చదువుకున్న విద్యార్థులు 18 ఏళ్ల తరువాత ఒక్కచోట కలుసుకున్నారు. 2006-07లో మండలంలోని తంగేడుకుంట జిల్లాపరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. అలనాటి జ్ఞాపకాలతో, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఎంఈఓ జయచంద్రారెడ్డి, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చెన్నారెడ్డి, ఉపాధ్యాయులు రాధమ్మ, క్రిష్ణమూర్తి, జనార్ధన, రవికుమార్, రమేష్, మధు, కరుణాకర్‌రెడ్డిలను శాలువ, పూలమాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అప్పటి గురువుల బోధనతోనే తాము ఉన్నతస్థాయికి ఎదిగామన్నారు. పూర్వ విద్యార్థులు ప్రమీల, కౌశిక్, వెంకటరమణ, మురళి, నరసింహయ్య, అశ్విని, గణపతి, నాగమణి, వసుంధర్, రేవతి, వనజా, దాక్షాయణి పాల్గొన్నారు.

కరాటే పోటీలు


ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

ధర్మవరం, అక్టోబరు 6: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మల్టీస్టార్ బూడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా హాజరైన జింకా పురుషోత్తం, జనార్దన్, కరాటే మాస్టర్ అక్బర్ అలీ యల్లో, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే కరాటే ఎంతో అవసరమని మాస్టర్ ఇనాయత్‌బాషా అన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక


పూజిత

ధర్మవరం, అక్టోబరు 6: పట్టణంలోని బీఎస్‌కే చెస్ అకాడమీ క్రీడాకారిణి పూజిత సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు అకాడమీ చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ తెలిపారు. విద్యార్థిని అనంతపురంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. శనివారం నెల్లూరులో నిర్వహించిన పోటీల్లో ఐదింటికిగాను నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి, తృతీయస్థానంలో నిలిచిందన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీకి మొత్తం ఐదుగురిని ఎంపిక చేసి వారిని నవంబరులో తమిళనాడు లా యూనివర్సిటీ కళాశాలలో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పంపుతారన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, అక్టోబరు 6 : పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు మున్సిపల్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. గొల్లపల్లి నుంచి హిందూపురానికి నీటి సరఫరా చేసే క్రమంలో ఎస్‌కేడీ పంప్ హౌస్ వద్ద విద్యుత్‌ప్యానెల్ బోర్డు మరమ్మతులకు రావడంతో పట్టణానికి నీటి సరఫరా ఆలస్యమవుతుందన్నారు. ఆదివారం విద్యుత్‌శాఖ సిబ్బందితో మరమ్మతులు చేపట్టామని, దీంతో సోమవారం కూడా నీరు సరఫరా చేసేందుకు అన్ని విధాలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు పెనుకొండలో ప్రజాదర్బార్

పెనుకొండ టౌన్, అక్టోబరు 6 : బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదిగల్లో చైతన్యం రావాలి

పెనుకొండ రూరల్, అక్టోబరు 6 : మాదిగలు చైతన్యవంతులుగా ఎదగాలని త్రిపుర రిసార్ట్ అధినేత గోపీనాథ్ పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండ సమీపంలో పలు జిల్లాల నుంచి మాదిగలు ఆత్మీయ సమావేశానికి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ గోపీనాథ్ ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ కృష్ణదేవరాయల విడిది పెనుకొండను రెండో రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం గోపీనాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాదిగలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అగళి, అక్టోబరు 6 : రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు.. బాలకృష్ణ అనే వ్యక్తి హనుమనపల్లి నుంచి ఇనగలూరుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. టిప్టూరు నుంచి నీలకంఠాపురం వెళ్లేందుకు కారులో వస్తుండగా అగళి హైవే జంక్షన్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టిప్టూర్ నుంచి వస్తున్న కారు అతివేగంతో ద్విచక్రవాహనంను ఢీకొనగా బాలకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. శిర ఆసుపత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలించారు. కారు డ్రైవరును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అమరాపురం, అక్టోబరు 6 : మండల పరిధిలోని హేమావతి గ్రామంలో మల్లప్ప(62) అనే వ్యక్తి కడుపు నొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. గత ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నట్లు వివరించారు. అనేకసార్లు డాక్టర్లకు చూపించినా నయం కాకపోవడంతో మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. భార్య పిల్లలు పనికి వెళ్లిన తరువాత ఆదివారం మధ్యాహ్నం ఇంటిలోనే దూలానికి ఉరేసుకొని మృతి చెందాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య హనుమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వికలాంగుడికి ట్రైసైకిల్ వితరణ



నవీన్‌కు ట్రైసైకిల్ అందజేస్తున్న జగదీశ్వర్

గోరంట్ల, అక్టోబరు 6: మండలంలోని పాలసముద్రం ఎస్సీకాలనీకి చెందిన నవీన్‌కు ఉపాధ్యాయుడు జగదీశ్వర్ ఆదివారం ట్రైసైకిల్ అందించారు. నవీన్ పుట్టుకతోనే రెండుకాళ్లు సరిగా లేని వికలాంగుడు. మూడేళ్ల క్రితం తల్లి నాగలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందారు. తరువాత తండ్రి స్వీపర్ నరసింహప్ప మృతి చెందారు. నవీన్ ప్రభుత్వ పింఛన్‌తో ఒంటరిగా జీవిస్తున్నాడు. పరిస్థితి గమనించిన సామాజిక సేవా కార్యకర్త దేవాంగం జగదీశ్వర్ పుట్టపర్తి సత్యసాయిబాబా భక్తుల సహకారంతో మూడు చక్రాల సైకిల్‌ను అందించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, అక్టోబరు 6: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6నుంచి 9వరకు డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే బాలయ్య లక్ష్యం

హిందూపురం, అక్టోబరు 6: నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే బాలకృష్ణ లక్ష్యమని ఆయన వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర అన్నారు. హిందూపురం మండలం బీరేపల్లి వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా షెడ్యూల్‌లో ఎంత బిజీగా ఉన్నా హిందూపురం అభివృద్ధిపై రోజుకు కనీసం 2గంటలపాటు కేటాయిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల కోసం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.30కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు అశ్వర్థనారాయణరెడ్డి, అరుణాచల్‌రెడ్డి, ఆనంద్, ఆదినారాయణ, రామక్రిష్టారెడ్డి, బాలిరెడ్డి, రామాంజి, ఉమాశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఆశాజనకంగా కంది పంట



ఏపుగా పెరిగిన కంది పంట

చిలమత్తూరు, అక్టోబరు 6: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. గత ఏడాది కంది పంట పూర్తిగా నష్టపోవడంతో మార్కెట్లో కంది పప్పు ధర విపరీతంగా పెరిగిపోయింది. ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసరాల్లో కంది రారాజుగా ఉంటోంది. ప్రస్తుతం కంది పప్పు ధర కిలో రూ. 140 నుంచి రూ.185 వరకు పలుకుతోంది. ఇటీవల వర్షాలు కురుస్తుండడం పంటకు అనుకూలంగా మారింది. చీడపీడల నుంచి పంటను రక్షించుకుంటే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా 713 ఎకరాల్లో సాగుచేశారు. సాధారణంగా వేరుశనగలో అంతరపంటగా వేసుకుంటారు. వేరుశనగ పంట సాగు విస్తీర్ణం తగ్గడంతో కంది సాగు కూడా గత కొన్నేళ్లుగా తగ్గుతూ వచ్చింది. కంది పప్పు ధరలు ఆకాశన్నంటుతుండటంతో రైతులు సాగుపై దృష్టి పెడుతున్నారు. దీంతో కందిని ఏకపంటగా సాగుచేస్తున్నారు.

సస్యరక్షణ తప్పనిసరి : వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి

ప్రస్తుతం కంది పంట ఆశించిన స్థాయిలో ఎదుగుదల కనపడుతున్నా, భవిష్యత్తులో చీడపురుగుల ఉధృతి ఉంటుంది. పంట మొగ్గ దశ నుంచే సస్యరక్షణ చేపట్టాలి. తుపానుల కారణంగా చలి తీవ్రత పెరిగి పూత రాలిపోయే ప్రమాదం ఉంటుంది. చీడ పురుగుల ఉధృతి పెరుగుతుంది. ప్రధానంగా పంట చీడపురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టల ఏర్పాటు, ఆకుచుట్టు పురుగు నివారణకు లీటరు నీటికి 2 మి.మీ. క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు నివారణకు క్లోరోఫైరిఫాస్ లీటరు నీటికి 2 మి.మీ లేదా థైయోడికార్బ్ లీటరు నీటికి 1 గ్రాము పిచికారి చేసుకోవాలి. కాయలో ఈగ నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.మీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కరుణించు తల్లీ.. కనకదుర్గ



గాయత్రీమాతగా చౌడేశ్వరీదేవి, కాత్యాయనిగా ఎల్లమ్మ, లలితాపరమేశ్వరిగా కన్యకాపరమేశ్వరి, మడకశిరలో కన్యకాపరమేశ్వరి, రత్నగిరిలో కూష్మాండదేవికి అలంకరణ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నాలుగో రోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను సుందరంగా ముస్తాబు చేశారు. తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. లింగంపల్లి రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో కాత్యాయినీదేవిగా, జలదుర్గమ్మ ద్రాక్ష, గోడాంబి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెనుకొండ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని లలితా పరమేశ్వరీ అలంకరణలో లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారిని కూర్మావతార రూపంలో అలంకరించారు. మడకశిర పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో కొలువు దీరారు. వడుసులమ్మ, ఊరి మారమ్మ, కొల్లాపురమ్మ, గంగాపూజమ్మ తదితర దేవాలయాల్లో విశేష అలంకరణలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన సత్యసాయి బాల వికాస్ పిల్లల ఆధ్యాత్మిక ప్రదర్శన ఆకట్టుకొంది. రొళ్ల మండలంలో సుప్రసిద్ధ పురాతన రత్నగిరి కోటలో వెలసిన శ్రీకాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కూష్మాండదేవి అలంకారం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సీఐ

మడకశిరటౌన్, అక్టోబరు 6 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామని సీఐ రాజకుమార్ తెలిపారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో నియోజకవర్గం వ్యాప్తంగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 20 కేసులు నమోదు చేశామని, రూ.7లక్షల నగదు స్వాధీనం చేసుకొన్నామని పేర్కొన్నారు. ఐదు మట్కా కేసులు నమోదు చేసి రూ.12వేలు స్వాధీనం చేసుకొన్నామన్నారు. పేకాట ఆడుతున్న 190 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పేకాట ఆడటంతో పాటు వారికి అక్కడే ఉండి డబ్బు అందిస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



గుంతలు పూడ్చివేస్తున్న సీఐ రాజ్‌కుమార్

గుంతలు పూడ్చిన సీఐ

మడకశిర పట్టణ సమీపంలోని హిందూపురం రహదారి, అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో రెండు పెద్ద గుంతలు ఏర్పడటం వల్ల ప్రతినిత్యం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఆదివారం సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది అటుగా వెళుతూ శ్రమదానం ద్వారా ఆ గుంతలను పూడ్చి వేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు తొలగాయి.

గుడిబండ : గ్రామాల్లో రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలు, మట్కా, జూదం, గొడవలు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

వైభవంగా హిందూ మహాగణపతి నిమజ్జనం

పావగడ, అక్టోబరు 6: విశ్వ హిందూపరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో పావగడలోని మధుగిరికోట వాకిలిలో నెలకొల్పిన హిందూ మహాగణపతిని ఆదివారం నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు గణపతిని ఊరేగిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే నృత్యాలతో యువకులు ఉత్సాహంగా తరలి వెళ్లారు. గణపతిని తిలకించడానికి భక్తులు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం బళ్లారి రోడ్డులోని పళవల్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పురుషోత్తంరెడ్డి, దేవరాజు, కిష్టప్ప, అలుకుందరాజు, శివప్రసాద్, అంజిగౌడ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

అనుమానాస్పద స్థితిలో కర్ణాటక వాసి మృతి

హిందూపురం, అక్టోబరు 6 : కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి ఆదివారం కొట్నూరు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ ఏఎస్ఐ ఆదినారాయణ తెలిపిన మేరకు.. చిత్రదుర్గం జిల్లా గంజిగెర గ్రామానికి చెందిన లోకేష్ (46)తో పాటు మరో ఇద్దరు వారం రోజులుగా హిందూపురం ప్రాంతంలో తిరుగుతున్నారు. శనివారం రాత్రి పొద్దుపోయాక శిర-కొడికొండ చెక్‌పోస్టు జాతీయరహదారి సింగిరెడ్డిపల్లి క్రాస్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం పడి ఉంది. ఇతడు కర్ణాటకలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ముగ్గురు వ్యక్తులు హిందూపురానికి వచ్చారు. ఏమి జరిగిందో కానీ ఇద్దరు వ్యక్తులు వెళ్లిపోయారు. ఇతను మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.



లోకేష్ మృతదేహం

సోమందేపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి..

సోమందేపల్లి : మండల కేంద్రంలోని చేనేత వస్త్రాల ఫ్యాక్టరీ వద్ద ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తెల్లవారుజామున రహదారిపై గాయాలతో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ ద్వారా పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు. మృతుడి షర్ట్ కాలర్‌పై డీసెంట్ టైలర్, సర్జాపుర అని రాసి ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని తెలిపారు.

అగళిలో సంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న దృశ్యం

అగళి, అక్టోబరు 6 : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల వద్ద ఆదివారం సంతను జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ ప్రారంభించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఆగిన సంతను ఆదివారం పునఃప్రారంభించారు. కూరగాయలు, నిత్యవసర సరుకులు, పశువులు సంత కూడా జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆదివారం సంత జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు మల్లికార్జున, రంగనాథ్, గోవిందరాజులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సరిహద్దు చెక్‌పోస్టులు

మడకశిర రూరల్, అక్టోబరు 6 : వైసీపీ పాలనలో మద్యం, ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని ఉద్దేశంతో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. వాటి కోసం లక్షలాది రూపాయలు ప్రజాధనం వెచ్చించింది. వైసీపీ పాలకుల ఆనాలోచిత నిర్ణయాల కారణంగా ఏడాది తిరక్కుండానే ఆ చెక్‌పోస్టులను మూసివేశారు. గత మూడేళ్లుగా ఈ చెక్‌పోస్టులు నిరుపయోగంగా ఉన్నాయి. మూతపడ్డ ఆ చెక్ పోస్టులు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండలంలోని ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, చందకచర్ల, గౌరిపురం, పాపసానిపల్లి, లక్ష్మీపురం, సుంకరెడ్డిపల్లి, క్యాంపురం, యు.రంగాపురం వద్ద చెక్‌పోస్టులను సరిహద్దుకు కిలో మీటరు దూరంలో ఏర్పాటు చేశారు. వీటిని వినియోగించకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రిపూట ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో మందుబాబులు వీరంగం సృష్టిస్తుండడంతో సమీప గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



క్యాంపురం వద్ద నిరుపయోగంగా ఉన్న సరిహద్దు చెక్ పోస్ట్, మందుబాబులకు నిలయంగా మారిన ఆర్.అనంతపురం చెక్‌పోస్ట్

కణ్వాశ్రమాన్ని సందర్శించిన మంత్రి



కోన కణ్వాశ్రమంలో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, అక్టోబరు 6 : మండలంలోని వెంకటగిరిపాళ్యం పంచాయతీలో ఉన్న కోన కణ్వాశ్రమాన్ని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సందర్శించారు. ఆదివారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనాశ్రమంలో పీఠాధిపతిగా విష్ణుదాసు స్వామి 50 ఏళ్లుగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. స్వామి మరణించిన అనంతరం దత్తానంద గిరిస్వామిని పీఠాధిపతిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, మాజీ ఎంపీపీ కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, శీనా పాల్గొన్నారు.

నేటి యువతకు ఆదర్శం వడ్డె ఓబన్న



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర్లు

హిందూపురం అర్బన్, అక్టోబరు 6: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని శ్రీకంఠపురంలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహం వద్ద ఆయన వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వడ్డె ఓబన్న తొలితరం ఉద్యమకారుల్లో ప్రముఖుడన్నారు. బ్రిటీష్ పాలకులను తరిమికొట్టడంలో ప్రధాన పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, వెంకటేశ్, నాగరాజు, దుర్గానాని, మంజునాథ్, గోపీ, శివ, గురుశంకర్, గంగాధర్, అమర్నాథ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతిని పరిగిలో వడ్డెర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రఘువీరారెడ్డి, సత్యవతి

మడకశిర రూరల్, అక్టోబరు 6: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కర్ణాటక డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి సత్యవతి పేర్కొన్నారు. స్వాతంత్ర సమర యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు శ్రీరామిరెడ్డి జయంతి సందర్భంగా గత 15 రోజులుగా క్రికెట్ నిర్వహించారు. ఆదివారం నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సత్యవతి మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. టోర్నమెంటులో విన్నర్స్‌గా సూర్యవిద్యానికేతన్, రన్నర్స్‌గా నీలకంఠాపురం జట్లు నిలిచాయి. పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను, ఉత్తమ రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మధుగిరి సబ్ కలెక్టర్ శివప్ప, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌర కార్మికులకు కిట్ల పంపిణీ



పౌరకార్మికులతో జపానందస్వామి, సిబ్బంది

పావగడ, అక్టోబరు 6 : పట్టణంలో పౌరకార్మికులుగా పనిచేస్తున్న 70 మందికి స్థానిక రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి దసరా కిట్లను పంపిణీ చేశారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే పౌరకార్మికుల సేవలే ముఖ్యం అన్నారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకే తమ ఇళ్లను కూడా శుభ్రం చేసుకోకుండా పట్టణాన్ని పరిశుభ్రం చేయడానికి కారకులైన పౌరకార్మికులకు ఎంత సేవ చేసినా తక్కువేనని కొనియాడారు. దసరా పర్వదినం సందర్భంగా తమ ఆశ్రమం నుంచి వారికి వస్త్రాలు, నిత్యావసరాల కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేష్‌బాబు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

అమరాపురం, అక్టోబరు 6 : మండలంలోని హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, మహేష్‌కుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

వ్యాయామ ఉపాధ్యాయ కమిటీ ఎన్నిక

పరిగి, అక్టోబరు 6: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. హిందూపురంలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కార్తీక్, ఉపాధ్యక్షులుగా హరీష్, మారుతి ప్రసాద్, గౌరవాధ్యక్షులుగా మూర్తి, విజయభాష్కర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శైలజ, కార్యదర్శిగా నారాయణ, ఈశ్వర్, ఇమ్రాన్, సహాయ కార్యదర్శులుగా సునీల్‌కుమార్, ఈసీ మెంబర్లుగా దుర్గాప్రసాద్, ఇర్ఫాన్, రాజ్‌మిత్ర, వెంకటేశ్, నవీన్, నరేష్, సురేష్‌ను ఎన్నుకున్నారు.